andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.3। కనిష్ఠం 28.6



నిర్మల్
జిల్లా వార్తలు

శనివారం 27 ఏప్రిల్ 2024



పట్టుబడిన లారీని వదిలేసేందుకు ఖానాపూర్ తహసీల్దార్ ఇచ్చిన రిలీజింగ్ ఆర్డర్

బేరం కుదిరిందా ?

- ఇసుక లారీ విడుదలపై తలెత్తుతున్న అనుమానాలు
- మొదటి తప్పుగా భావించి వదిలేశామని చెబుతున్న అధికారులు
- ఇసుక ఎత్తిన చోటనే ఖాళీ చేయించామని తహసీల్దార్ వివరణ
- పెద్దఎత్తున ముడుపులు ముట్టాయంటూ ప్రచారం
- చర్చనీయాంశంగా మారుతున్న అధికారుల తీరు

నిర్మల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడు తన సొంత అవసరాల కోసం ఇసుకను తెచ్చుకుంటే పట్టుకొని వేల రూపాయలు జరిమానా విధించే అధికారులు పెద్దల విషయంలో మాత్రం స్వామి భక్తిని చాటుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖానాపూర్ మండలంలో ఇటీవల పట్టుబడిన ఇసుక లారీ విడుదల అంశంలో అధికారులు చెబుతున్న సమాధానం సామాన్యుడిని సైతం ముక్కున వేలేసుకునేలా చేస్తోందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే గత మూడు రోజుల క్రితం బుధవారం సాయంత్రం ఖానాపూర్ మండలంలోని రామ్‌రెడ్డి పల్లె సమీపంలో ఓ లారీలో ఇసుక నింపుతున్నారని అటవీశాఖ అధికారులకు అందిన సమాచారంతో సంబంధిత అధికారులు ఆ లారీని పట్టుకున్నారు. ఇసుక నింపిన ప్రాంతం పూర్తిగా రెవెన్యూ పరిధిలోని భూమి కావడంతో అటవీశాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెబుతున్నారు. దీంతో ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్ గురువారం మధ్యాహ్నం ఆ లారీలో ఇసుక నింపిన అంశాన్ని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆ వెంటనే గురువారం రాత్రి లారీని విడుదల చేశారు. లారీని విడుదల చేసేందుకు తహసీల్దార్ చెప్పిన కారణం ఎన్నో అనుమానాలను రేకెత్తించేలా ఉందని స్థానికులు భావిస్తున్నారు.



ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

మొదటి తప్పుగా భావించి వదిలేశారట..!

ఇసుక లోడుతో నిర్మల్ ప్రాంతానికి వెళ్తూ కొమరం భీమ్ చౌరస్తా సమీపంలో పట్టుబడిన లారీని ఎటువంటి జరిమానా లేకుండా రెవెన్యూ అధికారులు వదిలిపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. సదరులారీలో ఇసుక తరలించేందుకు అనుమతి పొందిన వ్యక్తి ఎర్వచింతల్ నుంచి నియోజకవర్గానికి ఇసుకను తీసుకెళ్లాల్సి ఉందని తహసీల్దార్ తెలిపారు. కాగా డ్రైవర్‌కు ఎర్వచింతల్ అవగాహన లేక రామ్‌రెడ్డిపల్లె సమీపంలో ఉన్న ఇసుక కుప్పల నుంచి ఇసుకను లారీలో నింపుకొని వెళ్తుండగా పట్టుబడ్డారని తమ విచారణలో తేలిందన్నారు. సంబంధిత అనుమతి పొందిన వ్యక్తి ఇదివరకే ప్రభుత్వానికి డబ్బులు కట్టి అనుమతి పొందినందున అనుమతి పొందిన ప్రాంతం నుంచి కాకుండా ఇతర ప్రాంతం నుంచి తీసుకెళ్లడం మొదటి తప్పుగా భావించి ఎటువంటి జరిమానా లేకుండా లారీని అప్పగించినట్లు తహసీల్దార్ శివరాజ్ వివరించారు.

పేదోళ్లు పట్టుబడితే జరిమానా..
పెద్దోళ్లు పట్టుబడితే విడుదల..

చిన్నా చితకపనుల నిర్వహణ కోసం గ్రామాల్లో ఇసుకను తెచ్చుకునే నిరుపేద ప్రజలు పట్టుబడితే ఒక్కోట్రాక్టర్‌కు రూ. 5,000 నుంచి రూ. 10,000ల వరకు జరిమానాలు విధించే అధికారులు కోట్ల రూపాయల కాంట్రాక్టులు నిర్వహించే పెద్దోళ్ల పట్టుబడినప్పుడు మాత్రం వారి వాహనాలను పువ్వుల్లో పెట్టి అప్పగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖానాపూర్‌లో పట్టుబడిన ఇసుక లారీని ఎటువంటి జరిమానా లేకుండా రెవెన్యూ అధికారులు వదిలిపెట్టడం పట్ల జిల్లాలోని సామాన్యులు మండిపడుతున్నారు. పేదోళ్లకు ఒక న్యాయం, పెద్దోళ్లకు మరో న్యాయం ఉంటుందా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇంటి అవసరాల కోసం ప్రకృతి వనరులను తెచ్చుకునే నిరుపేద ప్రజలకు సైతం ఇటువంటి వెసులుబాటుని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. మొదటి తప్పుగా భావించి తమ వాహనాలను కూడా వదిలేస్తే తాము ఇసుక నింపిన చోటనే తిరిగి ఖాళీ చేస్తామని పలువురు చెబుతున్నారు. ఖానాపూర్ రెవెన్యూ అధికారులు కల్పించిన ఈ వెసులుబాటు సామాన్యులకు కూడా వర్తించాలని పలువురు కోరుతున్నారు.

మొదటి తప్పుగా భావించి వదిలేశాం

ఖానాపూర్ శివారులో బుధవారం సాయంత్రం పట్టుబడిన ఇసుక లారీ ఎర్వచింతల్ నుండి బాసర ప్రాంతానికి ఇసుక తరలించాల్సి ఉంది. అందుకోసం వారు అనుమతి పొందారు. కానీ డ్రైవర్‌కు అవగాహన లేక రామ్ రెడ్డి పల్లె వద్ద లారీలో ఇసుకను నింపుకొని నిర్మల్ వైపు తరలిస్తూ ఖానాపూర్ శివారులో అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. దీంతో అటవీ శాఖ అధికారులు లారీని మాకు అప్పగించారు. ఈ లారీ ఇసుక వ్యవహారంపై విచారణ జరపడంతో వారు అవగాహన లేక చేసినట్లు తేలింది. మొదటితప్పుగా భావించి ఎటువంటి జరిమానా లేకుండా లారీని వదిలిపెట్టాం.

శివరాజ్, తహసీల్దార్, ఖానాపూర్

వెంకటాపూర్‌లో

వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ముథోల్, ఏప్రిల్ 26 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో చివరిరోజు ధ్వజారోహణ, వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేద పండితులు ఆచార్య తేజ చక్రవర్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ముథోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు ముష్కం రామకృష్ణగౌడ్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు వేరువేరుగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సన్మానించారు. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముగ్గురు బాసర ఆలయ ఉద్యోగులకు ఛార్జ్ మెమో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం

బాసర, ఏప్రిల్, 26 : బాసర సరస్వతీ ఆలయంలో నిత్యావసర సరుకుల అవకతవకలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలకు బాధ్యులపై చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే దేవాదాయశాఖ కమిషనర్ ఆలయ ఈవోకు ఛార్జ్ మెమో జారీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో ముగ్గురు ఉద్యోగులకు ఛార్జ్‌మెమోలు జారీ అయ్యాయి. ఆలయ ఏఈవో సుదర్శన్‌గౌడ్, సూపరింటెంట్ సంజీవ్‌రావు, రికార్డు అసిస్టెంట్ నారాయణ పటేల్‌లకు ఛార్జ్‌మెమో జారీ చేసినట్లు ఆలయ ఈవో విజయరామరావు తెలిపారు. ఏఈవో సుదర్శన్‌గౌడ్ సెలవులో ఉండడంతో ఆయన వచ్చిన తర్వాత మెమోను అందజేస్తామని చెప్పారు. మెమోలకు వారిచ్చే సమాధానాన్ని బట్టి తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

ఘనంగా జగదాంబాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

మామడ, ఏప్రిల్ 26 : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీ జగదాంబదేవి సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు రోజుల నుంచి గ్రామంలో విగ్రహాలకు ప్రత్యేకపూజలు నిర్వహించి, గ్రామంలోని వీధులగుండా శోభాయాత్రగా తీసుకువచ్చి జలాధివాసం నిర్వహించారు. అనంతరం శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అర్చకులు అనీష్, సంతోష్ మహారాజ్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కైలాష్ టేకిడి మహారాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన, పుణ్యాహవాచనం, ప్రాణ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాష్ టేకిడి మహారాజ్ మాట్లాడుతూ... ఆధ్యాత్మికతతోనే మనసు ప్రశాంతంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జడ్పీ ఛైర్మన్ విజయలక్ష్మి రామ్‌కిషన్‌రెడ్డితో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, డీసీసీబీ డైరెక్టర్ హరీష్‌రావు, గ్రామాభివృద్ధి కమిటీ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయాధికారి సేవలు ఉత్తమమైనవి

- జిల్లా న్యాయాధికారి కర్ణకుమార్



జడ్జి అజేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మల్లారెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 : సీనియర్ సివిల్ న్యాయాధికారి కే.అజేష్‌కుమార్ సేవలు ఉత్తమమైనవని జిల్లా న్యాయాధికారి ఏకర్ణకుమార్ అన్నారు. సీనియర్ సివిల్‌జడ్జి అజేష్‌కుమార్ బదిలీ సందర్భంగా శుక్రవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి భవష్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, నిర్మల్ పెయింటింగ్ అందజేసి అభినందించారు. న్యాయవాదులు గోవర్ధన్, శుభకరణ్, నూనె గంగాధర్, కే. రమణ, రాజు పాల్గొన్నారు.

చిచ్చు రగిలించే పువ్వు..

పేదల కడుపు నింపే చెయ్యి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 26 : కులాలు, మతాల పేరిట చిచ్చు రగిలించే పార్టీ పువ్వు పార్టీ (బీజేపీ) అని, పేదల కడుపు నింపే పార్టీ ఇందిరమ్మ పార్టీ (కాంగ్రెస్) అని నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లూరి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ తండా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఎండాకాలంలో పేద ప్రజలు పని లేక పస్తులు ఉండే రోజులు ఉండకూడదని ఈ 'జాతీయ ఉపాధి హామీ పథకాన్ని' మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అమలు చేసిందని గుర్తు చేశారు. పేదల సంక్షేమ కోసం 'గరీబ్ హటావో నినాదాన్ని' ఇచ్చి 'ఆరు సూత్రాల పథకాన్ని' అమ్మ హస్తం పేరుతో బియ్యంతో పాటు 9 రకాలు నిత్యావసర సరుకులు అందజేసిన పార్టీ ఇందిరమ్మ పార్టీయేనని కొనియాడారు. లక్షలాది మంది పేదలకు భూములను, ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి పేదల సంక్షేమం కోసం పాటుపడుతూ అన్ని కులాలు, మతాలు ఒక్కటేనని లౌకిక భావన కలిగిన పార్టీ ఇందిరమ్మ పార్టీయేనని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పేదలందరికీ ఇళ్లను నిర్మించిన పార్టీ కూడా ఇందిరమ్మ పార్టీయేనని వివరించారు. కులం, మతం పేరిట యువతలో విషబీజాలు నాటి ఓట్లు దండుకునే కుటిల ప్రయత్నం చేయటం తప్పా ప్రజా సంక్షేమం కోసం బీజేపీ పార్టీ ఏనాడు కృషి చేయలేదని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మారుస్తామనటం, రిజర్వేషన్లు ఎత్తేస్తామనటం, ముస్లింల పట్ల విద్వేషపూరితంగా ప్రవర్తించటం బీజేపీ పార్టీ చేస్తున్న ఘోర తప్పిదాలని దుయ్యబట్టారు. మన ప్రాంతంలో ముస్లింలు, హిందువులు వరుసలు పెట్టుకుని పిలుచుకుంటూ బంధువుల మాదిరి జీవిస్తున్నామని అన్నారు. సోదర భావంతో ఉన్న మన సమాజం మధ్య బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టే ధోరణి క్షమించరానిదన్నారు. పేదల కోసం పెన్షన్లను ప్రారంభించిన పార్టీ కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి కంపుతో అతి గతి లేకుండా పోయిందన్నారు. కాబట్టి చేతి గుర్తుకే ఓటేసి మొదటి సారి పోటీ చేస్తున్న ఆడబిడ్డ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుగుణను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పాలిటెక్నిక్ కోర్సుల్లో

చేరేందుకు బాలికలకు అవకాశం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 : అనాథలు, పాక్షిక అనాథలు, నిర్లక్ష్యం చేయబడిన, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బాలికలు ప్రవేశ పరీక్ష రాయకున్నా పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు దుర్గాబాయి దేశ్‌ముఖ్ హైదరాబాద్ సాంకేతిక శిక్షణ సంస్థ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. మే 20లోగా కమిషనర్ శిశు సంక్షేమ శాఖ హైదరాబాద్ కార్యాలయంఓల దరఖాస్తు చేయాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ - ఎలక్ట్రికల్, కంప్యూటర్, ఈసీఈ డిప్లొమా కోర్సుల్లో ఒక్క దాంట్లో 60 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9963738012 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి : కలెక్టర్



ఎన్నికల నిర్వహణపై సూచనలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 : వచ్చే నెల జరిగే పార్లమెంట్ ఎన్నికలకు అ. దికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం ఈవీఎం యంత్రాల పనితీరు, ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్, ఫర్నిచర్ సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల రోజు ఒక కేంద్రంలో మాక్ పోలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య, పోలింగ్ అధికారుల పేరు. మొబైల్‌నంబర్ సమాచారం ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ శాతం వివరాలు సమయానికి పంపించాలన్నారు. ఈవీఎంల పనితీరులో సాంకేతిక సమస్యలు ఏర్పడితే అధికారుల ప్రోటోకాల్ ప్రకారం సరిచేయాలన్నారు. సెక్టోరియల్ అధికారుల విధులు, ఈవీఎం పనితీరుపై మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించారు. డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవోలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్- 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

జూన్ 9న గ్రూప్- 1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వమించి సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్, సీసీ కెమెరాలు, త్రాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, 200ల మీటర్ల లోపు జిరాక్స్ కేంద్రాలు మూసి వేయించాలన్నారు. ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ పత్రాలను కేంద్రాలకు తరలించేటప్పుడు పోలీస్ భద్రత కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని, నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. వైద్య సిబ్బందిని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ జానకి షర్మిల



హోంగార్డ్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 : పోలీసు కుటుంబాలకు ఏ సమస్య వచ్చిన వారికి అండగా ఉండి ఆదుకుంటామని ఎస్పీ జానకిషర్మిల భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆమె ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో మృతి చెంది హోంగార్డ్ మాసం కిరణ్ కుటుంబానికి ప్రమాద బీమా రూ. 30 లక్షల చెక్కుతో పాటు ఆయన ఇద్దరి పిల్లలకు 8 లక్షల చెక్కు భవిష్యత్ కోసం అందజేశారు. గత ఏడాది సెప్టెంబరు 27న హోంగార్డ్ మంజులాపూర్ వద్ద విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. పోలీసు శాఖ సిబ్బంది సాలరీ ఖాతా యాక్సిస్ బ్యాంకులో ఉండడంతో మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేశామన్నారు. యాక్సిస్‌బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనుస్ అలీ, రూరల్ సీఐ శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ, శైలేందర్, ఆర్ఎస్సై రవి కుమార్, సీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.




నాకాబంది తనిఖీలు చేస్తున్న ఎస్పీ, డీఎస్పీ

జిల్లాలో తనిఖీలు

జిల్లాలో శుక్రవారం ఏకకాలంలో సాయంత్రం 5 నుండి 7 వరకు నాకాబంది చేసి తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ జానకిషర్మిల నేతృత్వంలో కానిస్టేబుల్ స్థాయి వరకు అందరూ పాల్గొన్నారు. నిర్మల్ డివిజన్, భైంసా డివిజన్ విభాగాల్లో జరిగిన ఈ తనిఖీల్లో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డిల పర్యవేక్షణలో తనిఖీలు జరిగాయి.

డీసీసీ అధ్యక్షుడి సమక్షంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు. నిర్మల్‌లోని ఆయన నివాస గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో పలువురు మాజీ కౌన్సిలర్లు గోపు గోపి, ధర్మాజీ శ్రీనివాస్, ఎన్. అరుణ్, నాయకులు లక్కాకుల హరీష్‌లు పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు అప్పాల గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు సమక్షంలో చేరగా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో విశేష అభివృద్ధి జరుగుతుందని, గ్యారంటీలను అమలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అండగా నిలవాలని కోరారు. త్యాగాల కుటుంబంగా గుర్తింపు ఉన్న రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ ఎర్రవోతు రాజేందర్, పట్టణ అధ్యక్షులు చిన్ను, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రూ. 1.90 లక్షలను పట్టుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ. 1 లక్ష 90 వేల

సారంగాపూర్, ఏప్రిల్ 26 : మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్ వద్ద నిర్మల్ - స్వర్ణ రహదారిపై శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ. 1 లక్ష 90 వేలు పట్టుబడ్డాయి.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోరిగాం నుంచి నిర్మల్ వైపు పత్తిరెడ్డి పోతరెడ్డి మోటార్ సైకిల్‌పై ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1 లక్ష 90 వేలను పట్టుకున్నారు. పట్టుకున్నరూ. 1 లక్ష 90 వేలను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చంద్ర మోహన్ తెలిపారు. ఈ వాహనాల తనిఖీలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

మద్యం పట్టివేత

కుభీర్, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మండలంలోని గాలిసింగ్ తండాలో శుక్రవారం అక్రమ మద్యం పట్టుబడినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా గ్రామంలో గల ఒక బెల్ట్ షాపులో తనిఖీ చేయగా గ్రామానికి చెందిన చౌహాన్ బలిరామ్ అనే వ్యక్తి మద్యం అమ్ముతూ పట్టుబడినట్లు తెలిపారు. మొత్తం 10.42లీటర్లు, రూ.5,152విలువ గల మద్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.



పట్టుబడిన మద్యంతో పోలీసులు దృశ్యం

నర్సాపూర్(జి) : మండలంలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం బోస్లే దిలీప్ ఇంట్లో మద్యం అమ్ముతున్న సమయంలో దాడులు చేసి పదకొండు లీటర్ల మద్యం పట్టుకున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ 4920 ఉంటుందని, సుమోటో కేసు నమోదు చేసి విచారణ చేస్తునట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి సదస్సు కరపత్రం ఆవిష్కరణ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 : జిల్లా తెలంగాణ రచయితల వేదిక ఈ నెల 28న వరంగల్‌లో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి సదస్సు కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించింది. కార్యక్రమంలో దామెర రాములు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

ఎంఐఎం అధ్యక్షుడు జాబీర్‌తో బీఆర్ఎస్ ప్రతినిధుల భేటీ

● లోక్‌సభ ఎన్నికల్లో మద్దతుకు విజ్ఞప్తి ● అధిష్ఠానం ఆదేశాలే శిరోధార్యమన్న జాబీర్
● భేటీలో పాల్గొనని బీఆర్ఎస్ ముధోల్ సమన్వయ కమిటీ సభ్యులు

భైంసా, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎంఐఎం పార్టీ మద్దతు కూడబెట్టుకునేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే గురువారం రాత్రి బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జీ జోగు రామన్న, ఎమ్మెల్సీ దండే విఠల్, పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కులు భైంసాలో ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మెన్‌తో ప్రత్యేక భేటీ జరిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి మద్దతు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గంటకు పైగా బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం జాబీర్ అహ్మద్‌తో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా జాబీర్ అహ్మద్ పార్టీ అధిష్ఠానం ఆదేశాలే తమకు శిరోధార్యమని బీఆర్ఎస్ ప్రతినిధుల బృందానికి తేల్చి చెప్పినట్లుగా సమాచారం. అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా తాము ఎన్నికల్లో నడుచుకుంటామని వెల్లడించినట్లుగా తెలిసింది.. భేటీలోని విషయాలన్నింటిని పార్టీ పెద్దలకు వివరించి వారు ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని స్పష్టం చేసినట్లుగా సమాచారం. భేటీలో ఎంఐఎం భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఫయాజుల్లాఖాన్‌తో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



భైంసా మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్‌అహ్మద్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ ప్రతినిధులు బృందం

● ముధోల్ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ గైర్హాజరు

లోక్‌సభ ఎన్నికల్లో ఎంఐఎం మద్దతు కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల బృందం భైంసాలో జరిపిన కీలక బేటిలో ముథోల్ నియోజక వర్గానికి చెందిన ఆ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులెవరు పాల్గొనకపోవడం తీవ్ర చర్చకు దారి తీసింది. లోకసభ ఎన్నికల కోసం గాను పార్టీ అధిష్ఠానం ఇటీవలనే ముథోల్ నియోజక వర్గ పరిధిలో డా. పి.రమాదేవి, విలాస్ గాదేవార్, లోలం శ్యాంసుందర్, , డా.కిరణ్ కోమ్రేవార్‌లను సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించింది. వీరి ఆధ్వర్యంలోనే నియోజక వర్గ పరిధిలో ఎన్నికల ప్రచార పర్వం, పార్టీ సమావేశాలు, కార్యకలాపాలు జరుగుతున్నాయి. అయితే గురువారం రాత్రి భైంసాలో పార్టీ అగ్రనేతలు ఎంఐఎంతో జరిపిన కీలక బేటిలో నియోజక వర్గ పరిధిలోని సమన్వయ కమిటీ సభ్యులెవరు పాల్గొనకపోవడం చర్చకు దారి తీసింది. పార్టీ అగ్రనేతలు ఇక్కడి సమన్వయ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే ఎంఐఎం పార్టీతో చర్చలు జరిపారని ఒక వైపు ప్రచారం జోరుగా కొనసాగుతోంది. మరోవైపు భవిష్యత్ రాజకీయ పరిణామాలు, నియోజక వర్గ రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనే సమన్వయ కమిటీ సభ్యులు కీలక బేటికి దూరంగా ఉన్నారనే వార్తలు వినవస్తున్నాయి. ఏది ఏమైనా బేటిలో ముథోల్ నియోజక వర్గ బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొనకపోవడం పై చర్చోపచర్చలు జోరుగా కొనసాగుతున్నాయి.


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్ దంపతులు

పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వేడుకలను ఘనంగా జరుపుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పట్టణంలోని రవీంద్రనగర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయ విగ్రహా ప్రతిష్ఠాపన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే తన సతీమణి ఉమతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు జరిపారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమాది క్రతువుల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం కాలనికి చెందిన మహిళలు అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడు తూ కాలనీ వాసులంతా ఐక్యంగా ఉండి ఆలయాన్ని నిర్మించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.


మురుగునీటిని తాగుతున్న పశువులు

జలం అడుగంటె.. దాహం మిన్నంటె!

ఇచ్చోడ, ఏప్రిల్ 26: పెరుగుతున్న భానుడి ప్రతాపానికి పశుపక్షాదులు దాహంతో అల్లాడుతున్నాయి. పల్లెల్లో జలవనరులు వట్టిపోతున్నాయి. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పాటు బావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. ప్రజలతో పాటు పశువులకు దాహార్తి సమస్య తప్పడం లేదు. గ్రామాల్లోని జీవాలు గుక్కెడు నీటికోసం అల్లాడుతున్నాయి. మురుగునీటిని తాగి తమ దాహాన్ని తీర్చుకుంటున్నాయి. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మకు వెళ్లే రహదారి పక్కనున్న గుక్కెడు మురుగు నీటి కోసం ఆవులు, దూడలు ఆరాటపడుతున్నాయి.

పారిశుధ్య నిర్మూలనపై నిర్లక్ష్యం వద్దు

● రుయ్యాడిలో డీఎల్‌పీవో ఫణీంద్ర ఆకస్మిక తనిఖీలు

తలమడుగు, ఏప్రిల్ 26: గ్రామ పంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్మూలన పనులను చేపట్టాలని డీఎల్‌పీవో ఫణీంద్ర స్థానిక సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామంలోని మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. అంతేకాకుండా రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకును వారానికి మూడుసార్లు శుభ్రపరచాలని సూచించారు. ముఖ్యంగా వేసవి కాలంలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం సానిక నర్సరీని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది బీఎల్‌వోలు చేపడుతున్న పోలిచెట్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఓటర్‌కు ఇంటింటికీ వెళ్లి పోల్స్ స్లిప్పులను అందించాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గల రిజిస్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో పంచాయతీ సెక్రటరీ అభయకుమార్, ఎంపీవో వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



రుయ్యాడి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణీంద్ర

ఘనంగా హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

● పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, ఏప్రిల్ 26: దేశంలో ఉద్యమం ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హయాంలో అన్ని మతాలకు సమప్రాధాన్యము ఇచ్చామని రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ముందు ఏర్పాటు చేసిన హోమంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం. హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని తమ పూజలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు. అదేవిధంగా ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో మసీదుల, చర్చిలు, ఆలయాలు బుద్ద విహార్‌లు నిర్మించామన్నారు. అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి, తాజా మాజీ సర్పంచ్ గోస్కుల రాధా మహేశ్, గోవింద్‌రావ్, నరేందర్, దత్తు, సురేష్ బిబేకర్‌లతో ఆపటు కేదర్‌పూర్ మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

అందుబాటులో పామ్‌ఆయిల్ మొక్కలు

ముథోల్, ఏప్రిల్ 26 : ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకుంటున్న రైతులకు సబ్సిడీలో 5000 ఎకరాలకు సరిపడా మొక్కలు బీరెల్లి నర్సరీలో సిద్ధంగా ఉన్నాయని భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ బి. ప్రణీత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ముథోల్ మండలంలోని పిప్రి గ్రామంలో భూపాల్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్, సస్యరక్షణ పద్ధతులపై అలాగే వేసవిలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కొత్తగా ఆయిల్‌పామ్ మొక్కలు నాటబోయే రైతు సబ్సిడీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఒక ఎకరానికి 50 మొక్కలు నాటుకోవాలని, 90 శాతం రాయితీలో ఈ మొక్కలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మొక్క పూర్తి ఖరీదు రూ. 193 ఉండగా కేవలం రైతులకు 20 రూపాయలకే అందిస్తున్నామని వివరించారు. అదే విధంగా ప్రభుత్వం నుంచి ఒక ఎకరానికి రూ.4,200 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాలు మెయింటెనెన్స్ అమౌంట్ రైతుఖాతాలో జమ చేయబడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ క్లస్టర్ ఆఫీసర్ మొయిన్ మియా, భైంసా క్లస్టర్ ఆఫీసర్ ఆడెపు శేఖర్, నూతనంగా సాగు చేయబోయే రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టీఎస్ ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యమే సంస్థ ధ్యేయం

ఆసిఫాబాద్, ఏప్రిల్ 26: కార్మికుల ఆరోగ్యమే ఆర్టీసీ సంస్థ ధ్యేయమని ఆర్టీసీ ఆర్ఎంపీ సోలేమాన్ అన్నారు. శుక్ర వారం డిపోలో ఏర్పాటు ఏసిన గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అని, ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యం పట్ల సంస్థ ప్రత్యేక దృష్టిసారించి గ్రాండ్‌హెల్త్ క్యాంపు నిర్వ హిస్తోందన్నారు. డిపోలో పనిచేస్తున్న 331మంది ఉద్యోగులతోపాటు 57మంది అద్దెబస్సుల డ్రైవర్లకు ఆరోగ్యపరీక్షలను నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపు ఈనెల 30వరకు కొనసాగుతుందని కార్మికులు, ఉద్యోగులు ఈ అవశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎం విశ్వనాత్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఉదయ్ తదితరుల పాల్గొన్నారు.


కార్మికులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రేపు వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్, ఏప్రిల్ 26: గోదావరిఖనిలో ఈ నెల 28న నిర్వహించే సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయా లని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కె వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా కోరారు. శుక్రవారం వివిధ గనులపై గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. నూతన అండర్‌గ్రౌండ్ గనుల ఏర్పాటు, సొంతింటి పథకం అమలు, ఆదాయపు పన్ను మినహాయింపు, తదితర హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, ముందుండి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్మికులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఆయా సమావేశాల్లో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, పిట్ కార్యదర్శులు మురళీచౌదరి, బీర రవీందర్, గునిగంటి నర్సింగారావు, దాడి రాజయ్య, సంఘం సదానందం, మోతె లచ్చయ్య, ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి: సేఫ్టీ జీఎం

కాసిపేట, ఏప్రిల్ 26: కార్మికులందరూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని బెల్లంపల్లి రీజీయన్ సేఫ్టీజీఎం రఘుకుమార్ అన్నారు. శుక్రవారం కాసిపేటగనిపై నిర్వహించిన రక్షణఅవగాహన కార్యక్ర మానికి ఆయన హాజరై మాట్లాడారు. ఒకకార్మికుడిపై అతని కుటుం బం ఆధారపడి ఉందన్న విషయాన్ని మరువకూడదన్నారు. కార్మికులు బాగుంటేనే సంస్థ బాగుంటుందన్నారు. అనంతంర మొదటి సారిగా గనికివచ్చిన సేఫ్టీ జీఎంను కార్మిక సంఘాల నాయకులు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు విజయ్‌కుమార్, గనిమేనేజర్‌భూశంకరయ్య, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.


కాసిపేట గనిపై మాట్లాడుతున్న సేఫ్టీ జనరల్ మేనేజర్ రఘుకుమార్

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బోథ్, ఏప్రిల్ 26: బోథ్ మండల కేంద్రానికి చెందిన ఆడేపు ప్రవీణ్(35) అనే వ్యక్తి గురువారం సాయంత్రం పూట ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై బి.రాము తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్యాంట్‌తో ఉరి వేసుకుని చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. అయితే మృతుడు గతంలో ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి తిరిగి రావడం జరిగిందని తెసింది. దాదాపు రూ.4లక్షల మేర అప్పులు కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. కాగా మృతుడి కుటుంబీకులు సమీప బంధువుల పెళ్లికి వెళ్లడంతో వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసు కుంటున్నట్లు తెలపడం జరిగిందని పలువురు పేర్కొంటున్నారు. శుక్రవారం శవ పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● పురుగుల మందు తాగి యువకుడు..

బోథ్: మండలకేంద్రానికి చెందిన గుమ్మల జస్వంత్(19) అనే యువకుడు గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై బి.రాము తెలిపారు. గత కొన్ని రోజులుగా ఉద్యోగం రావడం లేదని మనోవేదనకు గురవుతున్నారని దీంతో పురుగుల మందు తాగడం కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్సు, బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 26: మండలంలోని దేవాపూర్ గ్రామం వద్ద శుక్ర వారం ప్రధాన రహదారిపై బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నార్నూర్ మండలంలోని చోర్పల్లి గ్రామానికి చెందిన దుర్వ చందు(27), ఆడ మధుకర్(20) బైక్‌పై ఆదిలాబాద్‌కు వెళుతుండగా ఉట్నూరు నుంచి ఆదిలాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో.. బస్సు వెనుక భాగానికి బైక్ ఢీకొంది. ఈ ఘటనలో చందు, మధుకర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108లో ఆదిలాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


చెట్టుకు ఢీకొన్న కారు

చెట్టును ఢీకొట్టిన కారు

● నలుగురికి తీవ్ర గాయాలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 26: మండలంలోని దేవాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం చెట్టుకు కారు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు బంధువుల పెళ్లికి వెళుతుండగా కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న భవానీ(48), సంజన(20), భానుప్రకాష్(22), తేజస్విని(18)లకు గాయాలయ్యాయి. వీరిని గమనించిన స్థానికులు హుటాహుటీన అక్కడికి చేరుకుని, 108లో ఆదిలాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దేవపూర్‌లో గొర్రెల మందపై కుక్కలదాడి

● 13 గొర్రె పిల్లలు మృతి

తలమడుగు, ఏప్రిల్ 26: మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన మద్దుల గంగా రెడ్డి చెందిన గొర్రెల మంద పై కుక్కల దాడితో 13గొర్రె పిల్లలను మృతి చెందినట్లు రైతు గంగారెడ్డి తెలిపారు. తన పొలంలో బంజరి దొడ్డిలో ఉన్న ఊరి కుక్కలు చొరబడి హతమార్చినారు. గొర్రెల మందను మేత కొరకు తీసుకు వెళ్లి రిటర్న్ వచ్చే వరకు దొడ్డిలో చొరబడి హతమార్చినాయి. వీటి విలువ దాదాపు 50వేల వరకు ఉంటుందని అని పోస్టు మార్టం అనంతరం పశువైద్య అధికారి డా.దూద్‌రాం రాథోడ్ తెలిపారు. కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని రైతు కోరారు.


కుక్కలదాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలను పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్యాధికారి దూద్‌రాంరాథోడ్

జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన కీర్తి


కీర్తిని అభినందిస్తున్న ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 : జేఈఈ అడ్వాన్స్‌కు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని బి. కీర్తి అర్హత సాధించింది. ఎన్‌పీటీ ప్రకటించిన జేఈఈ మెయిన్ ఫలితాల్లో 88.68 పర్సంటేజ్ సాధించింది. డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి దేవిదాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అర్హత సాధించిన కీర్తిని అభినందించారు.

పార్లమెంట్ ఎన్నికల

మెనిఫెస్టో గ్యారంటీ కార్డుల పంపిణీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో గ్యారంటీ కార్డులను డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు పంపిణీ చేశారు. శుక్రవారం నిర్మల్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసం పని చేసేదని శ్రీహరిరావు అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

బెజ్జూరు, ఏప్రిల్ 26: బెజ్జూరు మండలంలోని కోర్తే గూడ-పోతేపల్లి గ్రామాల మధ్య గురువారం అర్ధరాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడి కక్కడే మృత్యువాత పడగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్కపల్లి గ్రామానికి చెందిన దున్న నరసింహతో పాటు శనిగరం రాజ్‌కుమార్, ఆయిల్ల నిఖిల్ ఒక బైక్‌పై పోతేపల్లిలో బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లి రిసెప్షన్ కోసం వెళ్తున్నారు. బారేగూడ గ్రామానికి చెందిన తొర్రెం వెంగళరావు, అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేష్ మరో బైక్‌పై బూరుగు గూడలో కేశఖండనానికి వస్తున్నారు. వీరు వస్తున్న రెండు బైక్‌లు కోర్తెగూడ సమీపంలో అతి వేగంతో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో నర సింహ(20), మహేష్(26), వెంగళరావు(30) అక్కడి క్కడే మృతిచెందారు. ఈ ప్రమాదంలో నిఖిల్, రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై విక్రమ్ సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ క్షత గాత్రులను వైద్యం కోసం కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇందులో నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాలకు తరలించారు.

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 ; కనిష్ఠం 24.7



ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 27 ఏప్రిల్ 2024



● ఉట్నూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

'డబుల్' ఇళ్లపై.. ఆశలు!

- జిల్లాలో దశాబ్ద కాలం గడిచినా.. దశ మారని 'డబుల్ బెడ్‌రూం ఇళ్ల' తీరు
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ పేదవాడికీ ఇస్తామంటూ హామీ
- ఒక్కో ఇంటికి రూ.5.50లక్షల కేటాయింపు
- కొన్నిచోట్ల పూర్తికాగా.. మరి కొన్నిచోట్ల అసంపూర్తిగా పనులు
- కేటాయింపుల కోసం లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏజెన్సీవాసుల గంపెడు ఆశలు

ఉట్నూర్, ఏప్రిల్ 26: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజలు డబుల్ ఇళ్ల కేటాయింపులపై భారీ ఆశలే పెట్టుకున్నారు. అయితే, దశాబ్ద కాలం గడిచినా.. కొన్నిచోట్ల నిర్మాణ పనులు పూర్తికాగా, మరికొన్నిచోట్ల అసంపూర్తిగా అలాగే ఉండిపోయాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతీ పేదవాడికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తామని అధికారంలోకి వచ్చింది. అయితే ఆనాటి నుంచి ఇవ్వలేక పోవడంతో డబుల్‌బెడ్ రూమ్ గృహాల కేటాయింపులు ఎదురుచూపుల్లోనే మిగిలాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, సిర్పూర్, లింగాపూర్ మండలాల్లోని పేదలకు ఇళ్లు ఇస్తామని ప్రకటించిన అప్పటి తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దశాబ్ద కాలంలో ఇళ్లను నిర్మించలేక పోయింది. 2014లో అధికారంలోకి వచ్చిన అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉట్నూర్ కేంద్రంగా 80 గృహాలను మంజూరు చేసింది. వీటికి సంబంధించి 2016లో పనులు ప్రారంభించింది. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.5.50 లక్షలు కేటాయించి కాంట్రాక్టర్ల ద్వారా 2019లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసింది. ఇది కాకుండా ఏజెన్సీలోని ఇంద్రవెల్లి మండల కేంద్రానికి 80 ఇళ్లు మంజూరు కాగా, మిగతా 79 ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు టెండర్లు పిలిచారు. కాగా ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలు లేకపోవడంతో 35



● నిరుపయోగంగా మారిన డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇలా..




ఇళ్ల పనులు కాంట్రాక్టర్లు ప్రారంభించారు. ఈ ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. అలాగే, ఇంద్రవెల్లికి మంజూరైన 79 గృహాలలో 35 ఇళ్ల పనులు ప్రారంభించనిప్పటికీ.. 44 ఇళ్లను అప్పటి ఎమ్మెల్యే రేఖా నాయక్ ఖానాపూర్‌కు తరలించకు పోయారు. నార్నూర్ మండలానికి కేటాయించిన ఇళ్లు సైతం అసంపూర్తిగానే ఉన్నాయి. ఇదిలా ఉండగా జైనూర్ మండల కేంద్రంలో 24 ఇళ్ల పనులు ప్రారంభించగా.. ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. లింగాపూర్ మండలంలోని పిట్టగూడలో 22 గృహాలు మంజూరు కాగా కేవలం ఐదు ఇళ్ల పనులు పూర్తి అయ్యాయి. అవి పూర్తి అయినప్పటికీ ఇంకా ఎవరికీ కేటాయించక పోవడం గమనార్హం. సిర్పూర్ మండలానికి ఇళ్లు మంజూరు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

అడియాసలైన పేదల ఆశలు

2019లో నిర్మాణం పూర్తి అయిన ఉట్నూర్‌లోని ఇళ్లను పేద లబ్ధిదారులకు కేటాయించడంలో ప్రభుత్వం విఫలంమైంది. దీంతో పేద ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. 2018లో జరిగిన ఎన్నికల సమయం లో కూడా త్వరలోనే ఇళ్లు కేటాయిస్తామని ప్రజాప్రతినిధులు బుకాయించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇళ్లు కేటాయిస్తామని పేర్కొంటూ లబ్ధిదారుల నుంచి అధికారులు అర్జీలు సైతం స్వీకరించారు. దీంతో వందలాది మంది గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రజలకు లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయిస్తామని సంబంధిత అధికారులు ప్రకటించారు.

కోర్టును ఆశ్రయించిన ఆదివాసీలు

ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా గిరిజన ప్రాంతాలలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ గృహాలు గిరిజనులకు మాత్రమే కేటాయించాలని కొందరు ఆదివాసీ సంఘాల నాయకులు కోర్టును ఆశ్రయించారు. దీంతో జిల్లా అధికారులు ఎటూ తేల్చుకోలేక గిరిజనులకు ఇళ్లు కేటాయిస్తామని ప్రకటించారు. దీంతో ప్రజాప్రతినిధులు సైతం అభ్యంతరాలు తెలిపారు. అధికారులు మరోసారి ఇళ్లు లేని పేద గిరిజనులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని కోరడంతో పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. కాగా, 2022లో కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు లేని పేదలు కొందరు.. నిర్మాణం పూర్తి అయిన డబుల్ గృహాలను ఆక్రమించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు అధికారులు ఆక్రమించిన లబ్ధిదారులను బలవంతంగా ఖాళీ చేయించారు. గిరిజనేతరుల ఓట్లు అవసరం కానీ గిరిజనేతరులకు ఇళ్లు కేటాయించారా? అంటూ గిరిజనేతరులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులతో పాటు ఇతరులకు కూడా ఏజెన్సీ ప్రాంతంలో హక్కులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఏది ఏమైనా కోట్ల రూపాయలతో నిర్మించిన గృహాలు కొన్ని అసంపూర్తిగా.. మరికొన్ని పూర్తయినా ఇళ్లు కేటాయించక పోవడంతో ప్రభుత్వం ఆశయం నీరుగారిందని ప్రజలు అంటున్నారు. డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్ల కేటాయింపులు ఏజెన్సీ ప్రాంతాల ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారిందంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అయిన గిరిజనులు, గిరిజనేతరుల అనే తారతమ్యం లేకుండా పేదప్రజలందరికీ లబ్ధి కలిగించేలా చూడాలని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.





వివరాలను వెల్లడిస్తున్న బేల ఎస్సై రాధిక

పలు చెక్‌పోస్టుల వద్ద నగదు పట్టివేత

● తనిఖీల్లో మొత్తం రూ.లక్ష 73వేలు స్వాధీనం

జైనథ్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బేల మండలంలోని శంకర్‌గూడ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బేల ఎస్సై రాధిక ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా వాహనాలను తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి చంద్రపూర్ మీదుగా నాందేడ్ వైపు వెళ్తున్న కారు (ఎంహెచ్ 34 బీవీ 9000)ను తనిఖీ చేయగా అందులో రూ.93వేల నగదు కనిపించడంతో ఆ కారును అదుపులోకి తీసుకున్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కారు యజమాని గురువేసుంటకేపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాధిక తెలిపారు. డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ డబ్బును ఎస్ఎస్‌టీ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జైనథ్: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎస్ఎస్‌టీ మేజిస్ట్రేట్ జ్ఞానేంద్రషా, జైనథ్ మండల ఎస్సై కె.పురుషోత్తం ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాలను తనిఖీ నిర్వహిస్తున్నారు. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి బెంగుళూరు వైపు వెళ్తున్నకారు నెంబర్ కేఏ03ఎన్‌ఈ0844 ను తనిఖీ చేయగా అందులో రూ.80వేల నగదును పట్టుకున్నారు. ఆ నగదుకు ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో కారును సీజ్ చేసి అందులో ఉన్న రిషిబొరే, అశోక్‌బొరేల పై కేసు నమోదు చేశారు. ఈ నగదును డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ టీంకు అప్పగించామని ఎస్ఎస్‌టీ మేజిస్ట్రేట్ కె.జ్ఞానేందర్, జైనథ్ ఎస్సై కె.పురుషోత్తం తెలిపారు.

అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గ ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను సాధారణ పరిశీలకులు రాజేంద్రవిజయ్‌తో కలిసి జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ 23 మంది అభ్యర్థుల్లో 13 యాక్సెప్ట్ చేయగా 10 మంది రిజెక్ట్ అయ్యాయని తెలిపారు. అలాగే 42 నామినేషన్ సెట్స్‌లో 27 నామినేసన్ సెట్స్ యాక్సెప్ట్ కాగా 15 రిజెక్ట్ అయ్యాయని పేర్కొన్నారు. కాగా, యాక్సెప్ట్ అయిన అభ్యర్థులలో మాలోతు శ్యామ్‌లాల్ నాయక్, అలయన్స్ ఆఫ్ డెమెక్రటిక్ రిఫార్మ్ పార్టీ, రాథోడ్ సుభాష్, ఇండిపెండెంట్, ఆత్రం సుగుణ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ), మేస్రం గంగాదేవి, ధర్మ సమాజ్ పార్టీ, ఆత్రంసక్కు, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), గేడం సాగర్, ఇండియా ప్రజాబంధు పార్టీ, గోడం నగేష్, బీజేపీ అభ్యర్థి, కొడప వామన్ రావు, గొండ్వానా దండకారణ్య పార్టీ, భుక్య జైవంత్‌రావు, స్వతంత్ర అభ్యర్థి, నునావత్ తిరుపతి, విద్యార్థుల రాజకీయ పార్టీ, రాథోడ్ రాజు, స్వతంత్ర అభ్యర్థి, చౌహన్ సుదర్శన్, అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, జంగుబాపు మేస్రం, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి ఉన్నారు. అలాగే రిజెక్ట్ అయిన వారిలో చవాన్‌రామ్, ఇండిపెండెంట్, రాథోడ్ రమేష్, బీజేపీ, నేతావత్ రాందాస్, ఇండిపెండెంట్, కుమరం మంతయ్య, ఇండిపెండెంట్, పెందూరు సుధాకర్, ఇండిపెండెంట్, దారావత్ నరేందర్, బీఆర్ఎస్, ఆత్రం భాస్కర్, ఐఎన్‌సీ, నైతం రవీందర్, ఇండిపెండెంట్, మడావి వెంకట్‌రావు, రాష్ట్రీయ మానవ్ పార్టీ, ఆత్రం భీమ్‌రావ్, ఇండిపెండెంట్‌లు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం



గత వారం రోజుల నుంచి గ్రామానికి వచ్చే పైప్‌లైన్ లీకేజీ అవుతున్న దృశ్యం

భగీరథ పైప్‌లైన్ లీకేజీతో భగవాన్‌పూర్‌కు నీటి కష్టాలు

భీంపూర్, ఏప్రిల్ 26: ఆ గ్రామంలో 'మిషన్ భగీరథ' పైప్‌లైన్ లీకేజీ కారణంగా స్థానిక కుటుంబాలకు నీరు అందడం లేదు. భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ వారం నుంచి లీకేజీ అవుతోంది. దీంతో గ్రామస్థులకు నీరు అందక.. తాగునీరు, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం అధికారులకు విజ్ఞాపన చేసినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేసవి కాలం నేపథ్యంలో ఉన్నతాధికారులు తక్షణం స్పందిస్తే బాగుంటుంది అంటున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గిరిజన బాలికకు 67వ ర్యాంకు



ఉట్నూర్, ఏప్రిల్ 26: అఖిల భారత స్థాయిలో నిర్వహించిన జేఈఈ పరీక్షల్లో మండలంలోని నర్సాపూర్ తండాకు చెందిన గిరిజన విద్యార్థిని చౌహాన్ మేఘన 67వ ర్యాంకు చేజిక్కించుకుంది. అయితే, నర్సాపూర్ తండాకు చెందిన చౌహాన్ హాలీమాబాయ్, జైవంత్‌రావుల కూతురు మేఘన 67వ ర్యాంకు సాధించడం పట్ల ఉట్నూర్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మేఘనను అభినందిస్తున్నారు.

మేడే గోడప్రతుల విడుదల

ఇచ్చోడ, ఏప్రిల్ 26: మే 1వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన గోడపత్రులను శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పాత బస్టాండు ఆవరణలో విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సురేష్, రాజు, గంగయ్య, శివకుమార్, దాసన్న, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు

● మాదకద్రవ్యాలను సంపూర్ణంగా రూపుమాపడమే లక్ష్యం : ఎస్పీ గౌస్‌ఆలం ● రైల్వేస్టేషన్, ఠాకూర్ హోటల్ వద్ద ముమ్మర తనిఖీలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించారు. దీనిలో భాగంగా జిల్లాలో మాదక ద్రవ్యాలను సైతం సంపూర్ణంగా రూపుమాపాలనే లక్ష్యంతో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ముందుగా రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు జరిపిన అనంతరం ఠాకూర్ హోటల్ సమీప ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్లను ప్రభావితం చేసే వాటిని అనుమతించవద్దని ఆయన ఈ సందర్భంగా సూచించారు. సిబ్బంది 24 గంటలు అప్రమత్తతో ఉంటూ అక్రమ మద్యం, డబ్బు, గజాయి సరఫరాకు అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. వాహనాల తనిఖీ సమయంలో తప్పని సరిగా వీడియోగ్రఫి చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా పోలీసు యంత్రాంగం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐ అశోక్, తదితరులున్నారు.

● 'అనుమతి లేకుండా నగదు, మద్యం తరలిస్తే కఠిన చర్యలు'

తలమడుగు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని కోసాయి రైల్వేస్టేషన్‌లో మహారాష్ట్ర నుంచి తెలంగాణ ప్రాంతానికి వస్తున్న రైలు బండిని తలమడుగు ఎస్సై ధనశ్రీ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రైలుబండిలోని ప్రయాణికుల వద్ద తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరు కూడా అనుమతి లేకుండా రశీదులు లేకుండా రూ.50 వేలకు పైగా నగదును తరలించవద్దని ఎస్సై ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా మద్యం, మత్తు పదార్థాలను ఎవరైనా తరలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అంతేకాకుండా ఎవరైనా ఎన్నికల నిబంధన ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేపట్టారు. ఇందులో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● సిరికొండలో వాహనాల తనిఖీ

సిరికొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలను చేపట్టినట్లు సిరికొండ ఎస్సై నవీన్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్ మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అక్రమ మద్యం, ఎలాంటి ఆధారాలు లేకుండా అధిక మొత్తంలో నగదు రవాణా జరగకుండా తనిఖీలు చేపట్టామని అన్నారు. ప్రయాణికులు తమ వాహనాలలో అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లవలసి వస్తే వాటికి సరైన ఆధారాలను, రశీదులను కలిగి ఉండాలని సూచించారు. లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తామని తెలిపారు.



జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ, పోలీసులు



..ఠాకూర్ హోటల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ





తలమడుగు మండలం కోసాయి రైల్వే స్టేషన్‌లో రైలులోని ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు



సిరికొండలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై నవీన్ గౌడ్

బీజేపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించాలి

● ఎన్నికల నియమాళికి అనుగుణంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేయలేదు ● కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 26: ఎన్నికల కమిషన్ నియామవళికి అనుగుణంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్ పత్రాలను దాఖలు చేయలేదని వెంటనే ఆయన నామినేషన్‌ను తిరస్కరించాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అధికారులను కోరారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసిన అనంతరం కలెక్టరేట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గోడం నగేష్ తన కుటుంబ సభ్యులు, ఆస్తుల వివరాలను పొందుపర్చలేదని ఆరోపించారు. ఆ ఖాళీని పూరించకుండా వదిలేశారని అన్నారు. ఎన్నికల అధికారులు స్పందించి వెంటనే ఆయన నామపత్రాలను తిరస్కరించాలంటూ వారు డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఏ రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉండకూడదన్నారు. ఈ విషయమై ఇప్పటికే తమ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లామని, అవసరమైతే ఈ విషయంలో న్యాయ పోరాటం చేయడానికి సైతం సిద్ధమని స్పష్టం చేశారు. దీనిపై జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ తక్షణమే స్పందించాలంటూ విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. బీజేపీ అభ్యర్థి నామ పత్రం దాఖలుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ అధికార దుర్వినియోగం అంటూ ఆరోపించారు. న్యాయం కోసం ప్రజా కోర్టులో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జీ ఆడేగజేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తలమడుగు, జైనథ్ జడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, అరుంధతి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి